# మాలమాదిగ ఘర్షణల నివారణ కోసం కృషిచేద్దాం



మాలమాదిగ కులాల మధ్య రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలలో తలెత్తుతున్న ఘర్షణలు అందరికీ ఆందోళన కలిగిస్తున్నాయి. దళిత చైతన్యం కులవ్యవస్థను కులాధిక్యతనూ బలంగా సవాలు చేస్తున్న దశలో ఈ రెండు కులాల మధ్య వైషమ్యాలు తలెత్తడం చాలా బాధాకరమైన విషయం. దీనిని సకాలంలో పరిష్కరించకపోతే మొత్తంగానే దళితులు నష్టపోవడమే కాక కులనిర్మూలన కార్యక్రమం వెనకడుగు వేసే ప్రమాదం ఉంది.

ఈ రెండు కులాలు – రాష్ట్రంలోని 59 దళిత కులాలూ – తరతరాలుగా హైందవ సమాజం చేత వెలివేయబడిన పంచములు, 'ఊరి' బయట బ్రతికిన 'పల్లె' జీవులు, అంటరానివారు, ఇతరుల ఇళ్లలోకి పోకూడనివారు, కొన్నిచోట్ల ఇతరుల కళ్లకు కనిపించకూడనివారు, హైందవ సమాజం నీచంగా భావించిన పనులు తమ 'కులధర్మం'గా చేసినవారు. ఈ ప్రజలు ఈరోజు తమలో తాము కలహించుకోవడమేమిటి?

గడచిన కొన్ని దశాబ్దాల నుంచే దళితులు సమాజంలో కొద్దికొద్దిగా పైకి వస్తున్నారు. వామపక్ష పార్టీలు నడిపిన భూమి పోరాటాలూ కూలి పోరాటాలూ దళితుల ఆర్థిక స్థితినీ చైతన్యాన్నీ మెరుగుపరిస్తే, దళిత ఉద్యమం ముందుకు తెచ్చిన సమాన గౌరవం, సమాన ప్రతిపత్తి అనే డిమాండ్లు దళితుల సాంఘికస్థితిని మెరుగుపరిచాయి, ఆత్మవిశ్వాసాన్నీ ఆత్మగౌరవాన్నీ ఇచ్చాయి. ఈ ఉద్యమాల ఫలితంగా కనీస వేతన చట్టాలు, భూసంస్కరణ చట్టాలు, విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు, అంటరానితనాన్ని నిషేధించే చట్టాలు, దళితులపైన జరిగే భౌతికహింసను కఠినంగా శిక్షించే చట్టాలు వచ్చాయి. రాజకీయ రంగంలో దళితుల బలం పెరిగింది. దళితులను వెలివేసే ఆచారాలు కొద్దికొద్దిగా క్షీణించసాగాయి. కించపరిచే అలవాట్ల పట్ల నిరసన, ప్రతిఘటన పెరగడంతో అవి కూడ గతంలో లాగ సాగడం కష్టతరమయింది. విద్యా ఉద్యోగ రంగాలలో, తెల్లబట్టల జీవిత రంగంలో దళితులు చెప్పుకోదగ్గ సంఖ్యలో ప్రవేశించారు. దళిత జనాభాలో ఈ సంఖ్య చిన్నదే కావచ్చు కానీ ఈ మార్పు తీసుకొచ్చిన ఆత్మవిశ్వాసం, సాంస్కృతిక మార్పు స్వల్పం కాదు. సగటు దళితులు ఈరోజు ఆర్థికంగా తమ తాత ముత్తాతల కంటే ఎంతో బాగుండక పోవచ్చు. సాగునీటి సమృద్ధి ఉన్న ప్రాంతాలలో తప్ప ఇతర ప్రాంతాలలో మార్పు పెద్దగా లేకపోవచ్చు. కానీ సాంఘికస్థితిగతులు అంతకంటే ఎక్కువే మారాయి.



దళితుల ముందు ఇంకా ఎన్నో సమస్యలున్నాయి. పోరాటాల ఫలితంగా వచ్చిన సంస్కరణలూ చట్టాలూ సక్రమంగా అమలు కావడం లేదు. ఎస్.సి, ఎస్.టి (అత్యాచారాల నిరోధక) చట్టం నుండి ఉద్యోగ రంగంలో రిజర్వేషన్ల దాకా అన్నిటికీ ఇది వర్తిస్తుంది. అత్యాచారాల గురించి దళితులిచ్చే ఫిర్యాదులలో ఎక్కువ భాగం ఇన్వెస్టిగేషన్‌కు నోచుకోకుండ పోలీసుస్టేషన్ డైరీలలో మగ్గుతున్నాయి. 'రాజీ' ఒత్తిళ్లకు న్యాయం బలి అవుతున్నది. భూసంస్కరణలు సక్రమంగా అమలు కాకపోవడం



వల్ల దళితులకు భూమి దక్కకుండానే పోయింది. కనీసం ప్రభుత్వ పోరంబోకులయినా దున్నుకుందామంటే దానికోసం కూడ అడుగడుగునా పోరాటం చేయక తప్పని స్థితి ఏర్పడింది. ఈ పారిశ్రామీకరణ వేగంగా జరగక పోవడం వలన ప్రత్యామ్నాయ ఉద్యోగ అవకాశాలు పెరగడం లేదు. కూలి రేట్లు పెరుగుతూనే ఉన్నాయి గానీ పెరుగుతున్న ధరలు వాటిని వెన్నంటి తరుముతున్నాయి. ఏమయినా అవకాశం ఉంటే అది విద్యా ఉద్యోగ రంగాలలోనే. ఈరంగాలలో దళితులు సాధించే ప్రగతి కేవలం ఆర్థిక ప్రయోజనాన్నే కాక సామాజిక హోదానూ గౌరవాన్నీ కూడ పెంచుతుంది కాబట్టి దీనిపట్ల దళితులు ఆకర్షితులు కావడం సహజం. మాదిగల్లోనూ మాలల్లోనూ అత్యధిక మెజారిటీ కూలి చేసుకుని బతికే వాళ్ళే కాబట్టి కొద్దిమందికి మాత్రమే అందుబాట్లో ఉండే ఉద్యోగాల గురించి ఆందోళనలెందుకు అని వాదించడం కులవ్యవస్థ స్వభావాన్ని అర్థం చేసుకోకపోవడం అవుతుంది. అయితే రిజర్వేషన్లు కల్పించే ఉద్యోగావకాశాలు ప్రభుత్వ కళాశాలలు, ప్రభుత్వ ఉద్యోగ రంగం ఉన్నంతవరకే ఉంటాయి. సరళీకరణ పేరిట ఆర్థికవ్యవస్థే గాక సామాజిక సేవా రంగాలు కూడ ప్రైవేటీకరణ పాలయ్యేకొద్దీ ఈ ఒక్క అవకాశం కూడ తెరమరుగయ్యే ప్రమాదం ఉంది.

ఉద్యోగ అవకాశాల దగ్గరే దళిత కులాల మధ్య పోటీరావడాన్ని ఈ నేపథ్యంలో అర్థం చేసుకోవచ్చు. మన రాష్ట్రంలోని 59 దళిత కులాలు సాంఘికంగా, విద్యాపరంగా ఒకే రకంగా అభివృద్ధి చెందలేదు. ప్రభుత్వ ఉద్యోగ రంగంలో అందరి ప్రాతినిధ్యం ఒకే రకంగా లేదు. రాజ్యాంగంలోని 15(4) అధికరణం ప్రకారం రిజర్వేషన్లకయినా, వేరే ఏ ప్రత్యేక సదుపాయానికయినా 'సాంఘికంగా, విద్యాపరంగా వెనకబడి ఉండటం' ప్రమాణం కాగా, 16(4) అధికరణం ప్రకారం 'ప్రభుత్వ ఉద్యోగాలలో తగిన ప్రాతినిధ్యం లేకుండా ఉండటం' రిజర్వేషన్లకు ప్రమాణం. ఎస్.సిలు మొత్తంగా ఈ రెండు ప్రమాణాల ప్రకారమూ రిజర్వేషన్లకు అర్హులే. మాల కులస్తులు అభివృద్ధి చెందిపోయారు కాబట్టి వాళ్లను ఎస్.సి జాబితా నుంచి తొలగించాలని మాదిగల్లో కొందరు చేస్తున్న వాదన సరైంది కాదు. అయితే ఎస్.సిలలో ఏ కులాలయితే పై రెండు విషయాలలోనూ మరీ వెనుకబడి ఉన్నాయో వారికి ఎస్.సి రిజర్వేషన్‌లో ప్రత్యేక వాటా ఇవ్వడం (దానికి అనుగుణంగా ఎస్‌సి రిజర్వేషన్‌ను వర్గీకరించడం) ఈ ప్రమాణాల ప్రకారమే న్యాయమైనదని అందరూ అంగీకరించాలి. అది రాజ్యాంగబద్ధం కూడ అవుతుందని గతంలో సుప్రీంకోర్టు బి.సి కులాలను 'వెనుకబడినవి', 'మరీ వెనుకబడినవి' అని వర్గీకరించడంలో తప్పేమీలేదని ఇచ్చిన తీర్పులను బట్టి తెలుస్తుంది. ఈ సూత్రం ప్రకారమే మన రాష్ట్రంలో బి.సి కులాలను రిజర్వేషన్‌ల నిమిత్తం ఎ, బి, సి, డిలుగా వర్గీకరించారు.

ఈ ఆధారాలతోనే జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ ఎస్.సి రిజర్వేషన్ వర్గీకరణను సమర్థించింది. అక్షరాస్యతను ప్రమాణంగా తీసుకున్నా, ప్రభుత్వ ఉద్యోగరంగాలలో ఏ కులంవారు ఏ నిష్పత్తిలో ఉన్నారనేది ప్రమాణంగా తీసుకున్నా 59 దళిత కులాల మధ్య తేడా స్పష్టంగా ఉంది కాబట్టి వర్గీకరణ రాజ్యాంగ బద్ధమేకాకుండ అవసరంకూడ అని ఆ కమిషన్ భావించింది. వర్గీకరణను సమర్థించేవారందరి అభిప్రాయం కూడ ఇదే.

అయితే ఈ తేడాకు గల కారణమేమిటో చూడాలని, విద్యా ఉద్యోగ రంగాలలో వివిధ దళిత కులాల మధ్య అసమానత ఎందుకుందో చూడకుండా వర్గీకరణ చేయడం సరైనది కాదని వర్గీకరణను వ్యతిరేకించేవారు వాదిస్తున్నారు. కొన్ని కులాలకు చెప్పులు కుట్టడం వంటి వృత్తులు ఉండగా వేరేవాళ్లకు వృత్తులు లేవని, వృత్తులు ఉండటం వలన ఆ కులాలకు విద్యా ఉద్యోగ రంగాలలో ప్రవేశించవలసిన అవసరం, ఆసక్తి అంతగా లేవని వాదిస్తున్నారు. కాని ఆ వృత్తులు నిజానికి ఎంతమందికి తిండి పెడుతున్నాయి? ఎంత తిండి పెడుతున్నాయి? తిండి సంగతి అటుంచి ఆ వృత్తుల ద్వారా ఆ దళిత కులాలు ఎప్పటికైనా సమాజంలో పైకి రాగలవా? ఎవరి కులవృత్తులు వారికున్నప్పటికీ ఆధునిక విద్యా వైజ్ఞానిక రంగాలలోకి ప్రవేశించడంలోనే వారి పురోగతి ఉందనేది అర్థం చేసుకోవాలి. వివిధ వృత్తులను సంప్రదాయకంగా కలిగి ఉన్న శూద్రకులాలు ఆధునిక విద్యా ఉద్యోగ


రంగాలలోకి ప్రవేశించాలనీ దానికోసం రిజర్వేషన్లు కల్పించాలనీ మొదటినుండి కోరుకోవడానికి యిదొక కారణం కాదా?

దళిత కులాల మధ్య విద్యా ఉద్యోగ రంగాలలో కనిపిస్తున్న అసమానత ప్రాంతీయ అసమానతే తప్ప కులాల మధ్య అసమానత కాదని కూడ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నవాళ్లు వాదిస్తున్నారు. మన రాష్ట్రంలోని దళిత ప్రజానీకంలో మాదిగలు తెలంగాణ, రాయలసీమ జిల్లాలలో (ఒక్క చిత్తూరు మినహాయించి) మెజారిటీగా ఉన్నారు. మాలలు కోస్తా జిల్లాలలో మెజారిటీగా ఉన్నారు (కృష్ణా జిల్లాలో మాత్రం రెండు కులాల సంఖ్య దాదాపు సమానం). కాబట్టి రాష్ట్రంలో అన్ని రంగాలలోను కనిపించే కోస్తాజిల్లాల ఆధిక్యత దళితులలో మాలల ఆధిక్యతగా కనిపిస్తుందనే వాదనలో కొంత బలముంది. కాని తెలంగాణ, రాయలసీమ జిల్లాలను విడిగా తీసుకుని చూసినా అక్కడి విద్యా ఉద్యోగ రంగాలలో మాదిగలు తమ జనాభా నిష్పత్తి కంటే వెనుకబడి ఉన్నారన్నది వాస్తవం కాదా? దీని గురించి సమగ్ర సమాచారం లేకపోవచ్చు గాని జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ సేకరించిన సమాచారంలో పది జిల్లాలకు సంబంధించిన స్థానిక సంస్థలలోని ఎస్.సి ఉద్యోగుల గణాంకాలు ఉన్నాయి. అందులో ఏడు తెలంగాణ, రాయలసీమ జిల్లాలు. ఈ 7 జిల్లాలలోను ఎస్.సి జనాభాలో మెజారిటీ అయిన మాదిగలు 2 జిల్లాలలో మాత్రమే (మెదక్, మహబూబ్‌నగర్) ఉద్యోగుల సంఖ్యలో మెజారిటీగా ఉన్నారు. ఇది సమగ్ర సమాచారం కాదు కాని కొట్టి పారేయతగిందా?

దళిత కులాలలో సాపేక్షంగా వెనుకబడిన వారి అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు, ఆర్థిక సహాయం మొదలైనవి యియ్యవచ్చును కాని రిజర్వేషన్ వర్గీకరణ ఎందుకు చేయాలి అని వర్గీకరణను వ్యతిరేకించేవారి మరొక వాదన. రిజర్వేషన్లు కల్పించే బదులు యితర రూపాలలో చేయూత ఈయవచ్చుననేది ఒక ప్రత్యామ్నాయ ప్రతిపాదనగా ఎప్పటినుండో చర్చలో ఉంది. ఈ రకమైన వాదనను దళిత ఉద్యమం, ప్రజాతంత్ర ఉద్యమం మొదటినుండి వ్యతిరేకించాయి. మూడువేల సంవత్సరాలుగా ఈ దేశంలో పాతుకుపోయిన కులం నుండి పుట్టిన వ్యవస్థిత అసమానతలు పోవడానికి పరోక్ష అవకాశాలు ఎన్ని యిచ్చినా సరిపోదని, ప్రత్యక్షంగా రిజర్వేషన్లు కల్పించడమే దానికి మార్గమని ప్రజాతంత్ర ఉద్యమాలు వాదిస్తున్నాయి. ఇప్పుడు దళితులలో ఒక వర్గమే దానిని కాదనడం సబబా?


వర్గీకరణ జి.వోను కొట్టివేసిన హైకోర్టు తన తీర్పులో కొన్ని కారణాలను సూచించింది. నేషనల్ ఎస్.సి ఎస్.టి కమిషన్‌ను సంప్రదించకుండా వర్గీకరణ చేయడం ఆర్టికల్ 338కి విరుద్ధం అన్నదొక్కటే అందులో బలమైన కారణం. అది వర్గీకరణ చేసిన పద్ధతికి సంబంధించిన అభ్యంతరమే తప్ప వర్గీకరణకు సంబంధించిన అభ్యంతరం కాదు.

వర్గీకరణ వలన దళితుల మధ్య అనైక్యత తలెత్తుతుంది కాబట్టి అది అవాంఛనీయమనేది మరొక బలమైన వాదన. అనైక్యత తలెత్తే అవకాశం ఉన్నమాట వాస్తవమే. అది అవాంఛనీయమనేది కూడ వాస్తవమే. అనైక్యత తలెత్తకుండ చూడటం అవసరం. అది కేవలం దళితుల బాధ్యత, దళిత సంఘాల బాధ్యత మాత్రమే కాదు. ప్రజాతంత్ర వాదులందరి బాధ్యత. కానీ దానికి మార్గం ఏమిటి? తమ వాటా తమకు న్యాయంగా యిమ్మని అడిగేవాళ్ల కోరికను తిరస్కరించడమా? లేకపోతే ఆ కోరికను సహృదయంగా స్వీకరించి ఐక్యత దెబ్బ తినకుండా కాపాడుకోవడమా? తాము అసమానులమని గుర్తించనంతవరకే అసమానుల మధ్య ఐక్యత సాధ్యమవుతుంది. అప్పుడు సమానత్వ కాంక్షను గౌరవించి ఐక్యతను నిలబెట్టుకోవాలి.



అయితే ఈ రెండు కులాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడానికి యిరువర్గాల నాయకుల బాధ్యత ఉంది. వర్గీకరణను కోరుకుంటున్నవారూ దానిని వ్యతిరేకిస్తున్నవారూ తమ వ్యాఖ్యలలోను, వాదనలలోను తరచుగా సంయమనం

# మాదిగల న్యాయమైన హక్కులకు అండగా నిలబడదాం



పాటించకపోవడం ఈ పరిస్థితికి దారి తీసింది. మాలమాదిగలు ఒకరికొకరు శత్రువులని క్షణికోద్రేకంలో యువకులు అనుకున్నా వారికి నచ్చచెప్పవలసిన బాధ్యత ఉద్యమ నాయకులపై ఉంది.

మాలమాదిగ కులాల ఐక్యత కోసం అందరూ కృషి చెయ్యాల్సిన అవసరం ఈరోజు చాలా ఉంది. మాదిగ దండోరా ముందుకు తెచ్చిన వర్గీకరణ డిమాండ్ న్యాయమైనదని గుర్తిస్తూ స్పర్థలు పెరగకుండా ఉండడానికీ, అన్ని దళిత కులాలకు సామాన్యంగా ఉన్న అనేక సమస్యల పరిష్కారం కోసం దళితులు ఐక్యంగా నిలబడడానికీ కృషి చేయవలసి ఉంది. రిజర్వేషన్ల గురించే మాట్లాడుకున్నా రాష్ట్రప్రభుత్వంలో ఎస్.సి పోస్టుల బ్యాక్‌లాగ్ పదివేలకు పైగా ఉంది. రాష్ట్ర జనాభాలో పెరిగిన ఎస్.సి జనాభా నిష్పత్తిని అనుసరించి ఎస్.సి రిజర్వేషన్ కోటా పెరగవలసి ఉంది. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ కోసం పెద్ద ఆందోళన చేయవలసి ఉంది. ఇది ప్రపంచ బ్యాంకు నిర్దేశిస్తున్న ఆర్థిక విధానాలతో ప్రత్యక్షంగా తలపడే పోరాటం కూడ. రిజర్వేషన్లే కాక ఇతర ఆర్థిక, సాంఘిక హక్కుల కోసం కూడ ఉమ్మడిగా పోరాడవలసి ఉంది. అగ్రవర్ణాల దాడులను ఇద్దరూ సమైక్యంగా ఎదుర్కొనవలసి ఉంది. ఇరువర్గాల నాయకులూ ఈ దృష్టితో బాధ్యతాయుతమైన వైఖరి అవలంబించాలి. ప్రజాతంత్ర వాదులందరూ ఈ కృషికి సహకరించాలి. దళితుల ఉమ్మడి శత్రువు కులవ్యవస్థ, రాజకీయ ఆర్థిక వ్యవస్థ అని గుర్తించాలి. చీలిక పెరుగుతూ పోతే ఈ వ్యవస్థలలోని ఆధిపత్య శక్తులకే లాభమనీ దళితుల ప్రయోజనాలూ ప్రజాతంత్ర పురోగమనమూ దెబ్బ తింటాయనీ గుర్తించాలని పౌరహక్కుల సంఘం అన్ని దళిత కులాలనూ కోరుతున్నది.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం

(APCLC)

1 నవంబర్ 1997